నేటి కందం- నేటికి అందం

పొంగగ జనుల మనంబులు
మంగళములు జరుగు నటుల మహితోన్నతమౌ
గంగా ఎక్స్ ప్రెస్ రథ్యను
బంగరు హృదయుడు ప్రధాని ప్రారంభించెన్ !!
(594 కిలో మీటర్ల పొడవైన 6 లేన్ల గంగా ఎక్స్ ప్రెస్ హైవే ను భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

ధికారం ప్రతిపక్షం
అధినేతలు ప్రత్యర్థులే
శత్రుత్వం పరస్పరం
చేసుకుంటే బాధార్థులే

ప్రజలకొరకే పనిచేస్తే
పగలు సెగలు ఎందుకు
ప్రజాస్వామ్య బద్ధంగా
పోతే మంచి ముందుకు

చురక



-వేల్పుల నారాయణ
9440433475

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 1-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:204 పేజిలు:6 వెల: రూ.1/-

## అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం : రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:పహల్గామ్ ఉగ్రదాడి కి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని, ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0 లో మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సామర్థ్యం లేక ఆపరేషన్ సింధూర్ ను ఆపేయలేదని, అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయమని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ అని, ఇందులో మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకు వెళ్లాయని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. సొంత నిబంధనల ప్రకారమే ఆపరేషన్‌ను ప్రారంభించి సరైన సమయంలోనే దాన్ని ముగించామని, అది స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయమని అన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ అని చెప్పారు. దీనిపై పోరాటం కేవలం భద్రతకు సంబంధించిన విషయమే కాదని, మానవత్వపు మౌలిక విలువలను పరిరక్షించేందుకని వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశాన్ని అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా అభివర్ణించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని, దానికి బహుముఖ కోణాలు ఉన్నాయని అన్నారు. దాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాక్ నిరంతరం ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందని మండిపడ్డారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే.. పాకిస్థాన్ ఇంటర్నేషనల్ టెర్రరిజానికి కేంద్ర బిందువుగా మారిందంటూ ఎద్దేవా చేశారు.

## పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త: మంత్రి సీతక్క

హైదరాబాద్, ఏప్రిల్ 30: పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. దత్తత కావాలనుకున్న వారు ఐసీడీసీని సంప్రదించాలని సూచించారు. ఈరోజు (గురువారం) కాచిగూడ బస్ టెర్మినల్‌లో అమ్మఒడి తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని, కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పిల్లల దత్తత కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు.

సమ్మక్క - సారలమ్మ జాతరలో పిల్లల తల్లులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, జన సమూహ ప్రాంతాల్లో, బస్సు టెర్మినల్, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో తల్లిపాల ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక, శిశు, సంక్షేమ శాఖ అధికారులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చల్లని కబురు.. తెలుగు రాష్ట్రాల్లో వచ్చే మూడు రోజులు వర్షాలు!

హైదరాబాద్, ఏప్రిల్ 30:తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. నేడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం.

హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. నిన్నటి ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది.

## నార్నూర్ మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా : కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, ఏప్రిల్ 30: నీతి అయోగ్ కార్యక్రమంలో భాగంగా నార్నూర్ మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం నార్నూర్, గాదిగూడ మండలంలో ఆయన పర్యటించారు. నడ్డంగూడలో కళాత్మక వెదురు వస్తువుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

వెదురుతో తయారుచేసిన వస్తువులను పరిశీలిస్తూ, వివరాలు తెలుసుకున్నారు. వెదురు వస్తువులతో ఆర్థికంగా ఎదిగాలన్నారు. జామడ గ్రామంలో ఏర్పాటు చేసిన ఇప్ప పువ్వు పండుగ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. రక్తహీనత నిర్మూలనకు మోహ లడ్డూ ఎంతో ఉపయోగపడుతుందని, ఖైర్ దాట్వలో మోహ లడ్డు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

గాదిగూడ మండలం సావిరి పంచాయతీని సందర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, తాగునీటి సమస్యపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రాథోడ్ రవీందర్, డీఎల్పీవో ప్రభాకర్, తహసీల్దార్ జాడి రాజా లింగం, ఎంపీడీవోలు శ్రీనివాస్, పుల్లారావు, పీఆర్డీఈ లింగన్న, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కవిత పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు ఈసీ ఆమోదముద్ర

హైదరాబాద్, ఏప్రిల్ 30:టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసింది. టీఆర్ఎస్ పేరును కల్వకుంట్ల కవితకు అధికారికంగా ప్రకటిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. ఈనెల 25న మేడ్చల్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో టీఆర్ఎస్ పార్టీ పేరును కవిత ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఎన్నికల సంఘం ఆమోదించింది. ఈ మేరకు ఈరోజు (గురువారం) బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లిన ఎన్నికల అధికారులు.. పార్టీకి అనుమతి ఇస్తూ లేఖను అందజేశారు.

తన కొత్త పార్టీ పేరు టీఆర్ఎస్ అంటూ కవిత ప్రకటించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా.. టీఆర్ఎస్ పేరును కవిత పార్టీకి ఇవ్వొద్దంటూ కొంతమంది బీఆర్ఎస్ నేతలు ఈసీకి లేఖలు రాశారు. అయినప్పటికీ కవిత పార్టీ పేరును 'తెలంగాణ రక్షణ సేన'గా ఎన్నికల సంఘం అధికారికంగా గుర్తించింది.

## సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో ముగిసిన ఏసీబీ సోదాలు

సంగారెడ్డి, ఏప్రిల్ 30 : సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు ముగిశాయి. ప్రాపర్టీ టాక్స్ తగ్గించడానికి బిల్ కలెక్టర్ నిఖిల్ రెడ్డి రూ.35 వేలు ఓ వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేశాడు. ఇప్పటికే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన నిఖిల్ బాధితుడి నుంచి 20 వేల రూపాయలు తీసుకున్నాడు.

మిగితా డబ్బు కూడా ఇవ్వాలని ఒత్తిడి తేవడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. నేడు నిఖిల్ రెడ్డి బాధితుడి నుంచి 15 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. మున్సిపల్ కార్యాలయంలో 4 గంటల పాటు అధికారుల విచారణ కొనసాగిందని.. కేసు నమోదు చేసి నిఖిల్ రెడ్డిని కోర్టులో ప్రొడ్యూస్ చేశామని ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ వెల్లడించారు.

## మధ్య ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 15 మంది మృతి, మరో 30 మందికి గాయాలు



హైదరాబాద్, ఏప్రిల్ 30:మధ్యప్రదేశ్‌రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో 15 మంది మృతి చెందగా 30 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన ధార్ జిల్లాలోని ఇండోర్-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగింది.

కూలీలను తీసుకెళుతున్న వ్యాన్ బోల్తా పడి మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 మంది అక్కడికక్కడే చనిపోగా.. 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ధార్ జిల్లాలోని బగ్గద్ నుంచి 35 మంది కూలీలు పికప్ వ్యాన్‌లో ఇంటికి వస్తున్నారు.

ప్రాంతంలో చిక్లియా క్రాసింగ్ దగ్గర డ్రైవర్ వ్యాన్ కంట్రోల్ కోల్పోయాడు. దీంతో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఆ వెంటనే ఎదురుగా వస్తున్న ఎస్‌యూవీని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 15 మంది మృత్యువాతపడ్డారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కాగా, ఈ ప్రమాదంపై మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ స్పందించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.4లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. బాధితులకు అండగా ఉంటామని, సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

## జీవితంలో ఓడి... పదిలో గెలిచిన వర్షిత..

ఖమ్మం జిల్లా, ఏప్రిల్ 30 ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో జరిగిన ఈ ఘటన అత్యంత విషాదకరం. పదోతరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి ఉజ్వల భవిష్యత్తు ఉండాల్సిన ఒక విద్యార్థిని ప్రాణాలు తీసుకోవడం అందరినీ కలిచివేస్తోంది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామానికి చెందిన దారెల్లి వర్షిత (16) అనే విద్యార్థిని విషాదకరంగా ప్రాణాలు కోల్పోయింది. ఏప్రిల్ 24వ తేదీన ఉదయం ఆలస్యంగా నిద్రలేచినందుకు తల్లి మందలించగా, ఆవేశానికి లోనైన వర్షిత ఇంట్లో ఉన్న ఎలుకల మందు పేస్టు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లింది.

వర్షిత పరిస్థితి విషమించడంతో ముందుగా ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యులు ఆమెను బతికించడం కోసం ప్రయత్నాలు చేసిన పరిస్థితి విషమించడంతో నిన్న (బుధవారం) మృతి చెందింది. మృతదేహాన్ని తిరిగి గ్రామానికి తీసుకువచ్చి ఈరోజు (గురువారం) అంత్యక్రియలు నిర్వహించారు. వర్షిత నిన్న(బుధవారం) విడుదలైన పదోతరగతి పరీక్షల ఫలితాల్లో 530 మార్కులు సాధించి చదువులో మంచి ప్రతిభ కనబరిచింది. ఈ విషయం తెలిసిన తర్వాత కుటుంబ సభ్యులు, స్నేహితులు, పాఠశాల ఉపాధ్యాయులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. జీవితంలో ఓడిపోయినా, చదువులో మాత్రం విజేతగా వర్షిత నిలిచిందని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

## కరెంట్ షాక్‌తో మహిళా మృతి.. అనాథలైన ముగ్గురు చిన్నారులు

నారాయణపేట, ఏప్రిల్ 30: జిల్లాలోని కొత్తపల్లి మండలం దుప్పటి గట్టు గ్రామానికి చెందిన అనురాధ(37) అనే మహిళ కరెంట్ షాక్‌తో మృతి చెందింది. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో భాగంగా గోడలకు నీరు పట్టి మోటార్ స్టాటర్ బటన్ ఆఫ్ చేసే క్రమంలో కరెంటు షాక్ తగిలి కింద పడింది.

స్థానికులు గమనించి ఆమెను హుటాహుటిన మద్దూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించిందని వైద్యులు వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. అనురాధ భర్త చిన్న వైబు గౌడ్ రెండు సంవత్సరాల కిందట మరణించారు. తల్లి మరణంతో ముగ్గురు చిన్నారులు అనాథలుగా మిగిలారు.

## గౌతంపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



ఖమ్మం, ఏప్రిల్ 30: ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని వెంకటేష్ ఖని కోల్ మైన్ ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహారావు తెలిపారు. గురువారం సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో (ఎఐఅఓ ) వెంకటేష్ ఖని కోల్ మైన్ ప్రాజెక్టు ప్రభావిత పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా గౌతంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వంటి వ్యాధులపై పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం సింగరేణి సంస్థ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపించి ఇలాంటి వైద్య శిబిరాలను వినియెాగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి, వీకేసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహారావు, గౌతంపూర్ గ్రామ సర్పంచ్ సపవాట్ కళ్యాణి, గ్రామ కార్యదర్శి శర్మిల, వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్, ఏఐటీయూసీ నాయకులు ఎం.ఆర్.కే ప్రసాద్, ఐఎన్‌టీయూసీ నాయకుడు గోపుకుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమెరికా-ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్తాన్..

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 30: అమెరికా-ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్తాన్.. అమెరికాకు వెన్నుపోటు పొడుస్తుందా..? తాజా పరిణామాలు చూస్తుంటే ఔననే అనిపిస్తోందని అమెరికా నిపుణులు అంటున్నారు. ఇరాన్ రవాణాకు అనుకూలంగా ఆరు మార్గాల్ని పాక్ ప్రతిపదించినట్లు సమాచారం. ఒకపక్క హార్ముజ్ జలసంధిని దిగ్బంధించడం ద్వారా ఇరాన్‌పై ఒత్తిడి తేవాలని అమెరికా భావిస్తుంటే.. పాకిస్తాన్ మాత్రం ఇరాన్‌కు సాయం అందిస్తోందని అమెరికాకు చెందిన రక్షణ శాఖ నిపుణుడు డెరెక్ జె గ్రాస్‌మాన్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా సంచలన విషయాలు వెల్లడించారు. డెరెక్ తెలిపిన వివరాల ప్రకారం.. హార్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇరాన్ పోర్టుల్ని కూడా అమెరికా దిగ్బంధంలోకి తీసుకుంటోంది. దీని ద్వారా ఇరాన్ వాణిజ్యాన్ని అడ్డుకుని, ఆర్థికంగా దెబ్బతీయాలనేది అమెరికా ప్లాన్. ఇలా చేస్తే, ఇరాన్ దిగొచ్చి తమతో అణు ఒప్పందం చేసుకుంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి ఇతర దేశాలకు వాణిజ్యం చాలా వరకు ఆగిపోయింది. కానీ, ఈ విషయంలో ఇరాన్‌కు పాకిస్తాన్ సాయం చేస్తోంది. ఇరాన్ వాణిజ్యం చేసుకునేలా తమ దేశం నుంచి ఆరు ప్రత్యేక భూ మార్గాల్ని పాకిస్తాన్ ప్రతిపాదించింది.

హార్ముజ్ జలసంధితో సంబంధం లేకుండా, అమెరికా దళాలకు దొరక్కుండా ఈ రూట్లో ఇరాన్ వాణిజ్యం చేయొచ్చు. ఈ మార్గాల ద్వారా రష్యా, చైనా సహా ఇతర దేశాలకు ఇరాన్ చమురు, ఇతర ఉత్పత్తులు ఎగుమతి, దిగుమతులు చేసేందుకు పాకిస్తాన్ సహకరిస్తోంది. ఇప్పటికే మూడు వేల వరకు ట్రక్కులు ఈ రూట్లలో సరుకు రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అంటే, ఈ మార్గాల్లో ఇరాన్ వాణిజ్యం మొదలుపెడితే ఆ దేశానికి ఆర్థికంగా పెద్దగా నష్టం ఉండదు. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీయాలనే అమెరికా లక్ష్యం నెరవేరదు.

ఇది అమెరికాకు ఒక రకంగా పాకిస్తాన్ వెన్నుపోటు పొడవడమే. ఇరాన్?అమెరికా చర్చల అంశంలో మధ్యవర్తిత్వం వహించే సత్తా పాకిస్తాన్‌కు లేదనేది చాలా మంది ఎప్పటినుంచో అభిప్రాయపడుతున్నారు.

అటు ఇరాన్, ఇటు ఇజ్రాయెల్ కూడా ఈ

# ఎలక్ట్రానిక్స్ తయారీ రంగ విలువ-సరఫరా వ్యవస్థలలో...

## ప్రపంచ ప్రధాన, విశ్వసనీయ భాగస్వామిగా భారత్ రూపొందుతుంది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:ఎలక్ట్రానిక్స్ తయారీ పరంగా అంతర్జాతీయ విలువ-సరఫరా వ్యవస్థలలో ప్రపంచ ప్రధాన, విశ్వసనీయ భాగస్వామిగా భారత్ రూపొందుతుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్-సమాచార సాంకేతిక, రైల్వే, సమాచార-ప్రసార శాఖల మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ అన్నారు. విధానాల రీత్యా బలమైన మద్దతు సహా దార్శనిక నాయకత్వం ఇందుకు దోహదం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

విశాఖపట్నంలో ఇవాళ 'గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్' శంకుస్థాపన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలతో కలసి పాల్గొన్న అనంతరం ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు.

అదానీ కనెక్స్-ఎయిర్‌టెల్ నెక్స్ట్రా' సంస్థల భాగస్వామ్యంతో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టులో 'విశాఖపట్నం 1 గిగావాట్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్' కూడా ఒక భాగంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తర్లవాడ, రాంబిల్లి, అడవివరం ప్రాంతాల్లో సుమారు 600 ఎకరాల భూమిని ఈ ప్రాజెక్టు కోసం కేటాయించింది.

ఎలక్ట్రానిక్స్-తయారీ రంగాల్లో అగ్రగామి కానున్న భారత్

సమాచార సాంకేతిక సేవల రంగంలో ఇప్పటికే అగ్రస్థానంలో నిలిచిన భారత్, ప్రస్తుతం ఇప్పుడు ఎలక్ట్రానిక్స్, తయారీ రంగాల్లోనూ వేగంగా పురోగమిస్తోందని శ్రీ అశ్వనీ వైష్ణవ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

సెమీకండక్టర్లు, క్వాంటం, అంతరిక్ష, కృత్రిమ మేధ వంటి కీలక సాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచ కూడలిగా ఎదగాల్సిన అవసరాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఈ దిశగా గౌరవనీయ ప్రధానమంత్రి దార్శనికతను మంత్రి కొనియాడారు.

మొబైల్ తయారీ రంగంలో భారత్ గణనీయ ప్రగతి సాధించడంతో దేశం నుంచి ఎగుమతులలో మొబైల్ ఫోన్లు అగ్రశ్రేణి వస్తువుల జాబితాలో చేరాయని ఆయన పేర్కొన్నారు. దేశీయ ఎలక్ట్రానిక్ డిమాండ్‌లో దాదాపు 50 శాతం స్థానిక ఉత్పాదనతోనే తీరుతుండగా, సెమీకండక్టర్ మిషన్ కింద వాణిజ్య పరంగా ఉత్పత్తి ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు.

సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో భారత్ ఒక విశ్వసనీయ అంతర్జాతీయ భాగస్వామిగా మారుతోందని మంత్రి చెప్పారు. ఈ నేపథ్యంలో గూగుల్ సహా ప్రపంచ సాంకేతిక పరిజ్ఞాన సంస్థలన్నీ తమ సర్వర్లు, జీపీయూలు, చిప్‌లను భారత్ లోనే తయారు చేయించాలని పిలుపునిచ్చారు.

ఏఐ కూడలిగా ఆవిర్భవిస్తున్న విశాఖపట్నం

ఈ ప్రాజెక్టును పరిణామాత్మకమైనదిగా అభివర్ణిస్తూ- అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ప్రపంచ పెట్టుబడుల ద్వారా విశాఖ నగరం ఇక 'ఏఐ పట్నం'గా రూపొందగలదని కేంద్ర మంత్రి అన్నారు.

సమాచార సాంకేతిక వ్యవస్థల రూపకల్పనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు దార్శనికతను ఆయన ప్రశంసించారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన కొత్త ఏఐ డేటా సెంటర్ ద్వారా విద్య, ఆరోగ్య సంరక్షణ, ఏరోస్పేస్, లాజిస్టిక్స్, వ్యవసాయం తదితర రంగాలలో విప్లవాత్మక మార్పులు వస్తాయని పేర్కొన్నారు.

విశాఖపట్నం నుంచి ఆస్ట్రేలియా, మధ్యప్రాచ్యం, ఐరోపా, ఆఫ్రికా, అమెరికాల ద్వారా ప్రపంచ డిజిటల్ మార్గాలను అనుసంధానిస్తూ మూడు సముద్ర గర్భ కేబుళ్లు వేయడంపై గూగుల్ సంస్థకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించిన పారిశ్రామికవేత్తలు

ఈ కార్యక్రమంలో 'గూగుల్ క్లౌడ్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' వైస్-ప్రెసిడెంట్ బికాష్ కోలే మాట్లాడుతూ- వికసిత భారత్-2047' సంకల్ప సాకారంలో విశాఖ ఏఐ హబ్ మూల స్తంభంగా నిలుస్తుందన్నారు. అంతేకాకుండా భారత డిజిటల్ రూపాంతరీకరణ సహా ప్రపంచ ఏఐ ఆర్థిక వ్యవస్థలోనూ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

అదానీ గ్రూప్ చైర్మన్ జీత్ అదానీ ప్రసంగిస్తూ- భారత కృత్రిమ మేధ రంగం పురోగమనంలో ఇక్కడి "1 గిగావాట్ హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్" పునాదిగా మారుతుందని, తద్వారా విశాఖపట్నం నగరాన్ని జాతీయ నవ్య డిజిటల్ ముఖద్వారంగా నిలుపుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, సీనియర్ రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు సహా గూగుల్, అదానీ గ్రూప్, ఎయిర్‌టెల్ నెక్స్ట్రా తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కృష్ణానదిలో శ్రీరాముడి పంచలోహ విగ్రహం లభ్యం

-స్నానానికి దిగిన వారికి లభించిన విగ్రహం..
-పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు..
-చారిత్రక గుడిమెట్ల గ్రామంలో మరో అరుదైన విగ్రహం
-ఆధ్యాత్మిక,పర్యాటక అభివృద్ధి కోరుతున్న గ్రామస్తులు

అమరావతి, ఏప్రిల్ 30:ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామం వద్ద కృష్ణా నదిలో శ్రీరాముడి పంచలోహ విగ్రహం లభ్యమైంది. నదిలో స్నానం చేయడానికి దిగిన స్థానికులకు ఈ విగ్రహం కాళ్లకు తగలడంతో గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విగ్రహం ప్రాచీనత, మూలాలు తదితర అంశాలపై విచారణ కొనసాగుతోంది.

చారిత్రక ప్రాధాన్యం కలిగిన గుడిమెట్ల గ్రామం ఒకప్పుడు రాజులు పరిపాలించిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఏడు కోటలు, ఏడు పేటలతో 11వ శతాబ్దంలో రాజధానిగా విరాజిల్లిన ఈ గ్రామంలో గతంలో కూడా లక్ష్మీదేవి పంచలోహ విగ్రహం కృష్ణా నదిలో లభ్యమైంది. ఆ విగ్రహాన్ని గ్రామస్తులు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు. తాజాగా శ్రీరాముడి విగ్రహం లభించడం గ్రామానికి మరో ప్రత్యేకతను తీసుకువచ్చిందని స్థానికులు భావిస్తున్నారు. గుడిమెట్లను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# సింహవాహనంపై ఊరేగిన శ్రీవారు

## -భక్తులతో కిటకిటలాడిన దేవాలయం



అమరావతి, ఏప్రిల్ 30: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెన్నాహోబిలంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సింహవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శించారు. సుప్రభాత సేవలో భాగంగా దేవాలయంలో తెల్లవారుజా మున స్వామివారికి అభిషేకం వివిధ పుష్పాలతో అలంకరించారు. అర్చనలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

ఉభయ దాతలు కీర్తిశేషులు అమిలినేని వెంకటప్ప గారి కుమారులు సురేంద్ర అండ్ బ్రదర్స్ ఎస్ ఆర్ సి అనంతపురం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, దేవాలయ ప్రాంగణంలో భాజా భజంత్రీల నడుమ స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సింహ వాహనంపై ఉత్సవమూర్తులనుకు కొలవదీర్చారు.

మాడవీధులలో స్వామివారిని ఊరేగించారు. స్వామివారి దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో, దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఈవో సాకే రమేష్ బాబు, అర్చకులు ద్వారకనాథ్ చార్యులు, బాలాజీ చార్యులు, గుండురావు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగితేనే ఉజ్వల భవిష్యత్తు

## -తపస్ సమన్వయకర్త నర్సింగప్ప

ఆదిలాబాద్, ఏప్రిల్ 30: విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని కృషి చేస్తే ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని నారాయణపేట జిల్లా తపస్ సమన్వయకర్త దుంప నర్సింగప్ప అన్నారు. గురువారం ఊట్కూర్ మండలంలో ఎస్ఎస్‌సి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను తపస్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదో తరగతి ఫలితాల్లో మండల ఫస్ట్ ర్యాంక్ సాధించిన పి. పూజ (568 మార్కులు, జెడ్పీహెచ్ఎన్ చిన్నపొర్ల), జి. మహేష్ (556 మార్కులు, జెడ్పీహెచ్ఎన్ బాలుర పాఠశాల, ఊట్కూర్) ప్రతిభను ప్రశంసించారు.

విద్యార్థులు రాబోయే రోజుల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా ఆడపిల్లల్ని చిన్న వయసులో వివాహం చేయకుండా ప్రోత్సహిస్తే వారు మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలతో చదువుకుంటే వారి భవిష్యత్తు బంగారు మయం అవుతుందని అన్నారు.

పదో తరగతి అనంతరం తమకు నచ్చిన కోర్సులను ఎంచుకుని జీవితంలో రాణించాలని సూచించారు.

# ప్రాంతం ఏదైనా ప్రాధాన్యత మాత్రం ఒక్కటే..

**-1500 కేఎల్ వాటర్ ట్యాంక్ ను ప్రారంభించిన ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్యే బోండా ఉమ**

**-13 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించి స్థానిక ప్రజానీకానికి తాగునీటి కష్టాలకు స్వస్తి చెప్పిన ఎంపీ ఎమ్మెల్యే**



అమరావతి, ఏప్రిల్ 30: ప్రాంతం ఏదైనాప్పటికీ ప్రాధాన్యత క్రమంలో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసి అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాద్ పేర్కొన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 58వ డివిజన్ నందమూరి నగర్ వైవి రావు ఎస్టేట్స్ నందు 1500 కేఎల్ సామర్థ్యంతో ఎల్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్ ను ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్యే బొండావమ్మా కలిసి ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి కుళాయి ద్వారా బిందెలతో నీటిని నింపి మహిళ లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ంలో ప్రాంతం ఏదైనా ప్రాధాన్యత అందరికీ సమానమేనని ఎంపీ చిన్ని తెలియజేశారు. త్రాగునీటి సమస్య ఉన్న ప్రతి ప్రాంతంలో ప్రభుత్వ సహాయ సహకారాలతో త్రాగునీటి సమస్యను రూపుమాపే లక్ష్యంగానే పనిచేస్తున్నామని తెలియజేశారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల త్రాగునీటి సమస్య ఏర్పడిందని కోటమి ప్రభుత్వం దాన్ని రూపుమాపేందుకు అన్ని విధాల కృషి చేస్తుందని తెలియజేశారు.

శివారు ప్రాంతాల్లో సైతం అన్ని ప్రాంతాలకు ఇచ్చే సమాన ప్రాధాన్యతే ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి సూచనలు చేశారని తెలియజేశారు వాటర్ ట్యాంక్ వల్ల మహిళలు ఎంతగానో ఇబ్బంది పడుతున్న త్రాగునీటి సమస్య తీరిందని గుర్తు చేశారు. సుమారు 13 కోట్ల వ్యయంతో 15 ఆర్థిక సంఘం ఏఎంఆర్యూటి పథకం జనరల్ ఫండ్ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో జరిగిన సమావేశంలో విజయవాడ నగరంలోని ప్రధాన సమస్యలు చర్చించామని ఎంపీ గుర్తుచేశారు. అమరావతి తరహాలోనే విజయవాడ ను సైతం అందంగా అభివృద్ధి పథంగా తీర్చిదిద్దేందుకు కావలసిన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమా మాజీ కార్పొరేటర్లు డివిజన్ ఇన్చార్జులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# చలివేంద్రాలలో చల్లని త్రాగునీరుతో పాటు మజ్జిగ సరఫరా..



అమరావతి, ఏప్రిల్ 30:వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చడానికి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్( రాంఫీ) ఎస్ ఏ ఆర్ అనే ఒక ఫౌండేషన్ ని ప్రజా సేవ కొరకు స్థాపించి. ఫౌండేషన్ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ నియోజకవర్గం లో దాదాపు 20 కి పైగా ఎస్ ఏ ఆర్ ఫౌండేషన్ చలివేంద్రాలను నియోజకవర్గం అంతట ఏర్పాటు చేసే కార్యక్రమం గురువారం చేపట్టారు. అందులో భాగంగా ఎర్రవల్లి మండలకేంద్రంలోని 44వ జాతీయ రహదారి కూడలి చౌరస్తా పక్కనమాజీ ఎమ్మెల్యే ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ చలివేంద్రాని ప్రారంభించి, వాహనదారులు, ప్రయాణికులు బాటసారిలకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవగా భావించి వేసవిలో జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు, ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ చలివేంద్రాలను నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ చలివేంద్రాల వద్ద చల్లని త్రాగునీటితోపాటు వేసవికాలం అంతా కూడా మజ్జిగ పంపిణీ ఉంటుందని అన్నారు. ఎండ తాకిడి నుంచి ప్రజలు తమను తాము రక్షించుకోవాల్సిందిగా వారికి సూచిస్తూ ప్రజా శ్రేయస్సుకు ప్రజాసేవకు ఎల్లవేళలా ముందుంటానని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, డిసిసి ఉపాధ్యక్షులు నర్సిరెడ్డి, డిసిసి కార్యదర్శి మధు నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు రేణుకా బిసన్న, రవి ప్రకాష్, మద్దిలేటి యాదవ్, లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ లు జయ చంద్రారెడ్డి, రాముడు, పల్లె నిర్మల రాజు, జోగుల రవి, జైపాల్ రెడ్డి, శ్రీనివాన్ రెడ్డి, తిమ్మారెడ్డి, నారాయణ నాయుడు, ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల మైనార్టీ సెల్ అల్లా బకాష్, గార్లపాడు అల్లా బకాష్, ఉమాపతి నాయుడు, ప్రభాకర్, ఈదన్న నాయుడు, పాలభిన్న,మండల ఉపాధ్యక్షులు వెంకటేష్, ఎర్రవల్లి మండల వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు చర్యలు చేపట్టాలని 21 రాష్ట్రాలు, ఎన్‌సీటీ ఢిల్లీని ఆదేశించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 30:దేశంలో వీస్తున్న వడగాలుల నుంచి నిస్సహాయ స్థితిలో ఉన్న ప్రజలను రక్షించేందుకు ముందస్తు చర్యలతోపాటు సహాయక చర్యలనూ ఖచ్చితంగా అమలు చేయాలని 21 రాష్ట్రాలతోపాటు ఎన్‌సీటీ-ఢిల్లీని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచఆర్‌సీ) కోరింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి.

వడగాలుల తీవ్రత, వ్యవధి పెరగడం వల్ల తగిన ఆశ్రయం, వనరులు లేని అట్టడుగు వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వారు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు, నిరాశ్రయులపై తీవ్ర ప్రభావం పడుతోందని కమిషన్ గుర్తించింది. వృద్ధులు, పిల్లలు, నవజాత శిశువులు ఈ తీవ్రమైన వేడి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలకు త్వరగా గురయ్యే అవకాశం ఉందని పేర్కొంది. వడగాలులు కేవలం ఆరోగ్యంపైనే కాకుండా, జీవనోపాధి కోల్పోవడానికి, అగ్ని ప్రమాదాల ముప్పు పెరగడానికి కూడా కారణమవుతాయని హెచ్చరించింది.

ఈ కారణాలతో రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో సమగ్రమైన, సమ్మిళిత చర్యల తక్షణ అవసరాన్ని ఎన్‌హెచ్‌ఆర్‌సీ తెలియజేసింది. 2019-23 మధ్య దేశంలో వడదెబ్బ, తీవ్రమైన వేడి కారణంగా 3,712 మంది మరణించినట్లు జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) డేటాను కమిషన్ ప్రస్తావించింది. వడగాలుల ప్రభావాన్ని తగ్గించడానికి, ప్రాణనష్టాన్ని నివారించడానికి ఇప్పటికే వారి వద్ద ఉన్న ప్రామాణిక కార్యాచరణ విధానాలు (ఎస్‌ఓపీలు), జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సహాయక చర్యల ప్రణాళికను రూపొందించి, వాటి అమలును సులభతరం చేయాలని కమిషన్ వారిని కోరింది.రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల స్థాయిలో అన్ని జిల్లాల నుంచి సేకరించిన ఏకీకృత చర్యల నివేదికలను సమర్పించాలని కమిషన్ ఆదేశించింది.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నల్గొండ, ఏప్రిల్ 30:కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర నాయకులు శివారపు శ్రీధర్, మమత దంపతుల కుమార్తె నందిని, అలాగే ఆ పార్టీ మండల నాయకులు బెజ్జంకి బ్రహ్మాచారి, రాజేశ్వరి దంపతుల కుమారుడు భరత్‌ల వివాహం గురువారం స్థానిక హరిహర గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది.ఈ వివాహానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్, మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు, డీసీసీ అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, నాయకులు బండారు వెంకన్న, కదిరే సురేందర్, కౌన్సిలర్లు తరాల వీరేష్ యాదవ్, రాజు, మాజీ సర్పంచ్ ముదిగిరి సాంబయ్య, తరాల సుధాకర్, ఉప్పల వంశీ, సీఈఓ మల్లారెడ్డి తదితరులు హాజరయ్యారు.

# రైల్వే ఆధునికీకరణలో అగ్రగామి ప్రాంతాల సరసన ఏపీ: రైల్వేమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: విశాఖపట్నంలో గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ శంకుస్థాపన కార్యక్రమం అనంతరం జరిగిన సభను ఉద్దేశించి కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటి, సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని, జూన్ 1, 2026ను అమలు తేదీగా నిర్ణయిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ నిర్ణయం ఒక కీలకమైన అడుగు అని ఆయన పేర్కొన్నారు.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన రూ.886 కోట్ల రైల్వే బడ్జెట్ తో పోలిస్తే, ఇప్పుడు ఒక్క ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ. 10,134 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయింపులు లభించాయని ఆయన పేర్కొన్నారు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం సుమారు రూ. 1,06,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, ఇవి ఓడరేవులు, పర్యాటక ప్రాంతాలు, ప్రధాన నగరాలకు అనుసంధానంతో సహా రాష్ట్రవ్యాప్తంగా కనెక్టివిటీని మెరుగుపరచడం లక్ష్యంగా అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రస్తావిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో 74 రైల్వే స్టేషన్లను పూర్తిగా పునరాభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఇది దేశంలోనే ఒక చారిత్రాత్మక విజయమని ఆయన అభివర్ణించారు.

ఆంధ్రప్రదేశ్ తన రైల్వే నెట్‌వర్క్‌లో 100% విద్యుదీకరణను సాధించి, రైల్వే ఆధునీకరణలో అగ్రగామి ప్రాంతాల సరసన నిలిచిందని మంత్రి ప్రకటించారు.

ప్రయాణికుల సేవల విషయానికొస్తే, ప్రస్తుతం రాష్ట్రంలో 16 వందే భారత్ రైళు, 22 అమృత్ భారత్ రైలు సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇవి ప్రయాణ సామర్థ్యాన్ని, సౌకర్యాన్ని మెరుగుపరుస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

అంతేకాకుండా, తూర్పు తీర రైల్వే కారిడార్ మొత్తాన్ని నాలుగు లైన్ల నెట్‌వర్క్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, దీనివల్ల సామర్థ్యం రెట్టింపు అవ్వడమే కాకుండా, మరో 500 కొత్త రైళ్లను నడపడానికి వీలు కలుగుతుందని ఆయన చెప్పారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

## పూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం..

మేడ్చల్, ఏప్రిల్ 30:వ్యవసాయ రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ స్పష్టం చేశారు. గురువారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పూడూరు వ్యవసాయ రైతుల సొసైటీ కేంద్రంలో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కీలక అంశాలను ప్రస్తావించారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేసిన వెంటనే, ఆ సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పూడూరు సొసైటీ వారు ఒకవేళ గన్నీ బ్యాగులు (బస్తాలు) సరఫరా చేయడంలో విఫలమైతే, మేడ్చల్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోనే బస్తాలను పంపిణీ చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుంటే, ప్రతిపక్ష పార్టీలు మాత్రం అనవసర విమర్శలతో రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ?రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు సింగరేణి పోచయ్య, పూడూరు సొసైటీ డైరెక్టర్లు మనోహర్ రెడ్డి, శ్రీకాంత్ , స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిలకడైన భవితను దృష్టిలో పెట్టుకొని కీలక ఖనిజాల వ్యవస్థను అభివృద్ధి చేసే అంశంపై సంప్రదింపుల కార్యశాలను నిర్వహించిన గనుల శాఖ




న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: "నిలకడైన భవితను దృష్టిలో పెట్టుకొని కీలక ఖనిజాల వేల్యూ చైన్‌ను అభివృద్ధి చేయడం" అనే విషయంపై ఒక ఉన్నత స్థాయి సంప్రదింపుల కార్యశాల (వర్క్ షాప్)ను న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించారు. ప్రభుత్వ, పారిశ్రామిక, విద్యారంగ ప్రముఖులతో పాటు అంతర్జాతీయ సంస్థలకు చెందిన ఆసక్తిదారులు (స్టేక్‌హోల్డర్స్) ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు ద్వితీయ స్థాయి వనరులపైన, రీసైక్లింగ్ పైన దృష్టి కేంద్రీకరించి భారత కీలక ఖనిజాల అనుబంధ విస్తారిత వ్యవస్థను బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చోపచర్చలు చేశారు.

కార్యక్రమంలో గనుల శాఖ కార్యదర్శి శ్రీ పీయూష్ గోయల్ కీలకోపన్యాసాన్నిస్తూ, భారత కీలక ఖనిజాల వేల్యూ చైన్ ను అభివృద్ధి చేయడానికి ప్రయివేటు రంగం ఇప్పటి కంటే ఎక్కువ స్థాయిలో పాలుపంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ కీలక ఖనిజాల మిషన్ (ఎన్‌సీఎమ్ఎమ్)లో భాగంగా ప్రభుత్వ విధాన పరంగా అమలు చేస్తున్న కార్యక్రమాల్ని ఆయన వివరించారు. సంస్కరణలు, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, లక్ష్యాల సాధనకు ప్రోత్సాహకాల మంజూరు ద్వారా ఒక పటిష్ఠ, స్వయం సమృద్ధ సరఫరాల వ్యవస్థను రూపొందించుకోవడం ముఖ్యమని శ్రీ పీయూష్ గోయల్ తెలిపారు.

భారత్ ఇంధన పరివర్తన దిశగా పయనించడంలో, ఆర్థిక వృద్ధిని మెరుగు పరుచుకోవడంలో, సాంకేతిక పురోగతిని సాధించడంలో కీలక ఖనిజాల రంగానిది ముఖ్య పాత్ర అని ఆయన తెలిపారు. అన్వేషణ, శుద్ధి, రీసైక్లింగ్... వీటిలో ప్రయత్నాలను ప్రస్తుత స్థాయి కన్నా పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు.

గనుల్లో పోగయ్యే వ్యర్థాలు, టెయిలింగ్స్, శ్లాగ్స్, ఇతరత్రా పారిశ్రామిక అవశేషాలు వంటి ద్వితీయ స్థాయి వనరుల నుంచి విశిష్ట సామర్థ్యాన్ని వెలికితీయవచ్చని వర్క్‌షాపులో ప్రస్తావించారు. వీటిని కీలక ఖనిజాలకు అనువైన, తక్కువ ఖర్చులో లభ్యమయ్యే వనరులుగా చూడవచ్చని వివరించారు. పట్టణ ప్రాంతాల్లో గనుల తవ్వకం పనులకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని కూడా చర్చోపచర్చల సందర్భంగా గమనించారు. ప్రత్యేకించి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఈ-వేస్ట్), ఉపయోగం రీత్యా చివరి దశకు చేరుకున్న బ్యాటరీల రీసైక్లింగ్ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఈ ప్రక్రియలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని గుర్తుచేశారు.

సాంకేతిక సదస్సుల్లో భాగంగా, ద్వితీయ స్థాయి వనరుల్లో దాగివున్న విలువను రాబట్టడం, సరికొత్తగా తెర మీదకు వస్తున్న సాంకేతికతలతో పాటు ప్రయోగాత్మక ప్రాజెక్టులు, రీసైక్లింగ్ అనుబంధ విస్తారిత వ్యవస్థను బలోపేతం చేయడం, ఈ రంగాన్ని విస్తరించడానికి విధాన పరమైన, నియంత్రణ సంబంధిత, సాంకేతిక అంతరాలను పూడ్చడం వంటి కీలక అంశాలపై నిపుణులు చర్చించారు. హిందాల్కో, రుబామిన్, ఎటెరో, లోహమ్, ఏల్ట్‌మిన్, జీఎమ్‌డీసీ వంటి సంస్థలతో పాటు ప్రపంచ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన నిపుణులు సాంకేతిక సన్నద్ధత, వాణిజ్యం పరంగా లాభదాయకత, విలువను రాబట్టే ప్రయత్నాలను పెద్ద ఎత్తున చేపట్టడానికి విధానాల పరంగా అవసరమైన సహకారాన్ని అందించాల్సిన ఆవశ్యకతపై సూచనలు చేశారు.

ప్రయోగశాల స్థాయిలోని నూతన ఆవిష్కరణలను పారిశ్రామిక పరిష్కారాల స్థాయికి మార్పు చేయాల్సిన అవసరం చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. ప్రయివేటు పెట్టుబడులను ఆకర్షించడానికి, ఈ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి విధాన ప్రణాళికలను తీర్చిదిద్దాలన్న అంశం కూడా చర్చల్లో చోటు చేసుకుంది.

ప్రభుత్వం, పరిశ్రమ, విద్యారంగం... వీటి మధ్య మెరుగైన సమన్వయాన్ని ఏర్పరుచుకొని ప్రయోగాత్మక ప్రాజెక్టులను వేగంగా అమల్లోకి తేవడంతో పాటు ఫలప్రదమైన సాంకేతికతలకు విస్తృత స్థాయిలో ఆచరణ రూపాన్ని ఇవ్వడంపై ఏకాభిప్రాయానికి రావడంతో వర్క్‌షాప్ పూర్తి అయింది.

ఈ కార్యక్రమం లో వివిధ రంగాల నుంచి పెద్ద సంఖ్యలో ఆసక్తిదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కీలక ఖనిజాల వేల్యూ చైన్‌కు సంబంధించిన వివిధ కోణాలపై లోతైన, అర్థవంతమైన చర్చలు సాగాయి. లోతైన అవగాహనతో కూడిన చర్చోపచర్చలు, సందర్భశుద్ధి కారణంగా వర్క్‌షాపు అత్యంత ఫలప్రదంగా ముగియడంతో పాటు, మార్పునకు చోదక శక్తిగా మారింది. ఎనర్జీవా వెంచర్స్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# నావికాదళ నౌకా విధ్వంసక క్షిపణి (స్వల్ప శ్రేణి) తొలి సాల్వో ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన డీఆర్డీవో, భారత నావికాదళం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:నావికా దళానికి చెందిన స్వల్పశ్రేణి నౌకా విధ్వంసక క్షిపణి (ఎన్ఏఎన్ఎం-ఎన్ఆర్) సాల్వో ప్రయోగాన్ని రక్షణ పరిశోధన - అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో), భారత నౌకాదళం కలిసి విజయవంతంగా నిర్వహించాయి. ఒడిశాలోని బంగాళాఖాతం తీరంలో ఉన్న నావికాదళ హెలికాప్టర్ వేదిక నుంచి ప్రయోగాన్ని చేపట్టారు. ఈ పరీక్షలో భాగంగా ఒకే హెలికాప్టర్ నుంచి రెండు క్షిపణులను వెనువెంటనే ప్రయోగించారు. గాల్లో ప్రయోగించే అత్యాధునిక నౌకా విధ్వంసక క్షిపణి వ్యవస్థలో ఇలాంటి సాల్వో ప్రయోగం ఇదే మొదటిది.

చండీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) ఏర్పాటు చేసిన రాడార్, ఎలక్ట్రో ఆప్టికల్ సిస్టమ్, టెలిమెట్రీ వంటి వివిధ ట్రాకింగ్ పరికరాల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం, ఈ పరీక్ష లక్ష్యాలన్నీ పూర్తిగా నెరవేరాయి. ఈ ప్రయోగం క్షిపణుల సాల్వో ప్రయోగ సామర్థ్యాన్ని నిరూపించడమే కాకుండా, శత్రు నౌకలను జలమట్టం వద్దే ఢీకొట్టే కచ్చితత్వాన్ని కూడా క్షిపణులు చాటుకున్నాయి. డీఆర్‌డీవో సీనియర్ శాస్త్రవేత్తలతోపాటు భారత నావికాదళం, వాయుసేన ప్రతినిధులు, అభివృద్ధి-ఉత్పత్తిలో భాగస్వాములు (డీసీపీపీ) ఈ పరీక్ష ప్రయోగాలను వీక్షించారు.

ఈ ఎన్ఏఎన్ఎమ్-ఎన్ఆర్ క్షిపణిలో సాలిడ్ ప్రొపల్షన్ బూస్టర్, ఎక్కువ సేపు మండే సస్టెనర్‌ను అమర్చారు. సీకర్, సమీకృత ఏవియానిక్ విభాగం, ఫైబర్-ఆప్టిక్ గైరోస్కోప్ ఆధారిత ఇనర్షియల్ నావిగేషన్ వ్యవస్థ, రేడియో-ఆల్టిమీటర్‌ను ఉపయోగించుకునే అధునాతన చోదక - నిర్దేశక వ్యవస్థ వంటి కీలక ఉపవ్యవస్థలన్నీ దేశీయంగానే రూపొందాయి. వీటితో పాటు అత్యాధునిక నియంత్రణ, మార్గనిర్దేశక అల్గారిథమ్, హై బ్యాండ్‌విడ్త్ టూ - వే డేటా లింక్, జెట్ వేన్ కంట్రోల్ వ్యవస్థలను డీఆర్‌డీవోకు చెందిన వివిధ పరిశోధనశాలలు, భారతీయ పరిశ్రమలు అభివృద్ధి చేశాయి.

ఇతర డీఆర్‌డీవో పరిశోధనశాలలైన రక్షణ పరిశోధన - అభివృద్ధి పరిశోధనశాల - హైదరాబాద్, హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ - పూణె, టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ లాబొరేటరీ - చండీగఢ్, ఐటీఆర్ - చండీపూర్‌తో కలిసి... హైదరాబాద్‌లోని పరిశోదన కేంద్రం ఇమారత్ ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇతర భారతీయ పరిశ్రమలు, అంకుర సంస్థల సహకారంతో డీసీపీపీ ప్రస్తుతం ఈ క్షిపణులను ఉత్పత్తి చేస్తోంది.

తొలి సాల్వో ప్రయోగాన్ని విజయవంతం చేసిన డీఆర్డీవో, భారత నౌకాదళం, భారత వైమానిక దళం, డీసీపీపీ భాగస్వాములు సహా పరిశ్రమ వర్గాలను రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ఈ క్షిపణి అభివృద్ధి రక్షణ దళాల సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుందని ఆయన అన్నారు.

సాల్వో ప్రయోగాలను విజయవంతం చేసిన బృందాలకు రక్షణ పరిశోధన, అభివృద్ధి విభాగం కార్యదర్శి, డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి. కామత్ శుభాకాంక్షలు తెలిపారు.

# అమరావతి పనులకు..మరో రూ.2,540 కోట్లు..

### సచివాలయం గ్లాస్ క్లాడింగ్ పనులకు కేబినెట్ ఆమోదం
### ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల సవరణ
### అసెంబ్లీ పరిసరాల్లో సివిల్ వర్క్స్ కోసం రూ. 798 కోట్లు కేటాయింపు
### 385 మంది కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్‌కు ఓకే
### చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీ
### 20 అంశాలపై సుదీర్ఘంగా చర్చ



అమరావతి, ఏప్రిల్ 30:అమరావతిలో పలు అభివృద్ధి పనులను రూ.2,540 కోట్లతో చేపట్టాలని చంద్రబాబు కేబినెట్ నిర్ణయించింది. కృష్ణానది ఫ్లడ్ ప్రొటెక్షన్ పనులతో పాటు అమరావతిలోని సచివాలయం గ్లాస్ క్లాడింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్ట్ బాధితులకు గృహ యూనిట్ ఖర్చు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో చంద్రబాబు అధ్యక్షతన గురువారం కేబినెట్ భేటీ జరిగింది.. మొత్తం 20 అంశాల అజెండాతో జరిగిన ఈ సమావేశంలో వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.. ఈ సందర్భంగా పలు అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అసెంబ్లీ పరిసరాల్లో సివిల్ వర్క్స్ కోసం రూ.798 కోట్ల ప్రణాళికతో పాటు ఉండవల్లి జోన్‌లో మౌలిక వసతుల కోసం రూ.580 కోట్ల ప్రణాళికకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. 220 కేవీ కేబుల్స్ రీరూటింగ్ పనులకు రూ.1,180 కోట్లు కేటాయించింది. ప్రకాశం జిల్లాలో ఇండస్ట్రియల్ హబ్‌కు భూమిని కేటాయించింది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 2000 బ్యాచ్‌కు చెందిన 385 మంది కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ కల్పించే ప్రతిపాదనకు పచ్చజెండా ఊపింది. ఢిల్లీలో ఏపీ భవన్ నిర్మాణానికి రూ.124.5 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.

మున్సిపాలిటీలకు చెందిన ఆస్తుల లీజ్ రెన్యువల్, అద్దె నిర్ణయ విధానాల సవరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యుటేషన్ ఛార్జీలను ఒకే విధంగా అమలు చేసే చట్టసవరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. హైకోర్టు, జిల్లా న్యాయస్థానాల్లో చీఫ్ కోర్టు మేనేజర్, సీనియర్ కోర్టు మేనేజర్లు, కోర్టు మేనేజర్లతో కలిపి 21 కొత్త పోస్టులు సృష్టించేందుకు అంగీకారం తెలిపింది. ఢిల్లీలోని ఏపీ భవన్లో అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ కార్యాలయంలో ఆఫీస్ మేనేజర్ పోస్టును సెక్షన్ ఆఫీసర్గా అప్గ్రేడ్ చేసే ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. ఏపీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, ఈటీసీ శిక్షణ కేంద్రాల్లో 20 పోస్టులు సృష్టించే ప్రతిపాదనకు ఆమోదం ఇచ్చింది. అదనంగా మరో 9 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను ఔట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేసే ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది.

# విపత్తులపై తక్షణ హెచ్చరికల కోసం దేశవ్యాప్తంగా స్వదేశీ సెల్ బ్రాడ్‌కాస్ట్ వ్యవస్థ పరీక్షలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోని టెలీకమ్యూనికేషన్ల విభాగం (డాట్) జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్డీఎంఏ)తో కలిసి, పౌరులకు కీలక సమాచారం సకాలంలో అందేలా చూసేందుకు దేశవ్యాప్తంగా మొబైల్ ఆధారిత విపత్తు సమాచార వ్యవస్థలను చురుగ్గా బలోపేతం చేస్తోంది.

టెలీకమ్యూనికేషన్ల విభాగానికి చెందిన ప్రధాన పరిశోధన - అభివృద్ధి కేంద్రం - టెలిమాటిక్స్ అభివృద్ధి కేంద్రం రూపొందించిన సమగ్ర హెచ్చరిక వ్యవస్థ (సాచెట్) ను ఎన్డీఎంఏ విజయవంతంగా అమలులోకి తెచ్చింది. అంతర్జాతీయ టెలీకమ్యూనికేషన్ యూనియన్ సిఫార్సు చేసిన సాధారణ హెచ్చరిక నియమావళి (కామన్ అలర్టింగ్ ప్రోటోకాల్- సీఏపీ) ఆధారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఇది ప్రస్తుతం భారతదేశంలోని మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అమల్లో ఉంది. భౌగోళికంగా లక్షిత ప్రాంతాలలో ఉన్న మొబైల్ వినియోగదారులకు విపత్తు, అత్యవసర సంబంధిత హెచ్చ ను సంక్షిప్త సందేశాల ద్వారా అందజేస్తుంది.

విపత్తు నిర్వహణ అధికారులు ఈ వ్యవస్థను విస్తృతంగా వినియోగించుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ హెచ్చరికలు, తుపాను సమయాలలో 19 పైగా భారతీయ భాషలలో నేటి వరకు 13,400 కోట్లకు పైగా లఘు సందేశాలను పంపడానికి ఇది వీలు కల్పించింది.

సునామీలు, భూకంపాలు, పిడుగులు వంటి అత్యవసర సమయాల్లోనూ, గ్యాస్ లీకేజీలు, రసాయన ప్రమాదాల వంటి మానవ తప్పిద అత్యవసర పరిస్థితుల్లోనూ హెచ్చరికల చేరవేతను మరింత పటిష్టం చేయడానికి, లఘు సందేశాలతో పాటు సెల్ ప్రసార సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. సెల్ ప్రసార వ్యవస్థలో, నిర్ణీత భౌగోళిక ప్రాంతంలో ఉన్న అన్ని మొబైల్ ఫోన్లకు ఏకకాలంలో హెచ్చరికలను పంపుతారు, తద్వారా హెచ్చరికలు తక్షణమే అందేలా చూస్తారు.

ఈ సెల్ ప్రసార ఆధారిత ప్రజా అత్యవసర హెచ్చరిక వ్యవస్థ స్వదేశీ అభివృద్ధి, అమలు బాధ్యతలను సీ- డాట్ కు అప్పగించారు.

దేశవ్యాప్త అమలు, సెల్ ప్రసార సదుపాయం ప్రారంభంలో భాగంగా, వ్యవస్థ పనితీరు, విశ్వసనీయతను అంచనా వేయడానికి, అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయడానికి ముందుగా ప్రస్తుతం దేశవ్యాప్తంగా పరీక్షలు, పరిశీలనలు చేపట్టారు. ఈ సమయంలో, ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో ఇంగ్లీష్, హిందీ, ప్రాంతీయ భాషలలో పరీక్షా సందేశాలను పొందవచ్చు.

అయితే ఈ టెస్ట్ సందేశాలు సెల్ బ్రాడ్‌కాస్ట్ టెస్ట్ ఛానెళ్లను ఎంచుకున్న మొబైల్ ఫోన్లకు మాత్రమే అందుతాయి (వినియోగదారులు తమ సెల్ ఫోన్లలో హెచ్చరికల కోసం ఆమోదం తెలపవచ్చు, లేదా తిరస్కరించవచ్చు: సెట్టింగ్స్ - సేఫ్టీ అండ్ ఎమర్జెన్సీ - వైర్‌లెస్ ఎమర్జెన్సీ అలర్ట్స్- టెస్ట్ అలర్ట్స్). టెస్టింగ్ ప్రక్రియలో భాగంగా, మొత్తం మొబైల్ నెట్‌వర్క్ మౌలిక వసతుల్లో సరైన పనితీరును ధ్రువీకరించడంలో గ్రహీతలు అనేక సందేశాలను అందుకోవచ్చు.

ఈ సందేశాలు ప్రణాళికాబద్ధమైన దేశవ్యాప్త పరీక్షా ప్రక్రియలో భాగం మాత్రమే. ఈ సందేశాలకు గ్రహీతలు ఏ రకంగానూ స్పందించాల్సిన అవసరం లేదు.

ఇది హెచ్చరికల ప్రసారం కోసం సెల్ ప్రసార వ్యవస్థ పరీక్షలో భాగంగా, భారత ప్రభుత్వ టెలీకమ్యూనికేషన్ల విభాగంతో కలిసి జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ పంపిన మొబైల్ ప్రసార పరీక్షా సందేశం. సెల్ ప్రసార వ్యవస్థ పరీక్ష సమయంలో, ఈ సందేశం మీ మొబైల్ కు పలుమార్లు రావచ్చు. దయచేసి ఈ సందేశాలను పట్టించుకోవద్దు. మీ వైపు నుంచి ఎటువంటి చర్యా అవసరం లేదు.

విజయవంతంగా పరీక్షించి అమల్లోకి తెచ్చిన తర్వాత, సెల్ బ్రాడ్‌కాస్ట్ (సీబీ)వ్యవస్థను అన్ని మొబైల్ హ్యాండ్‌సెట్లలో టెస్ట్ ఛానెల్ సెట్టింగ్స్‌కు సంబంధం లేకుండా అనేక భారతీయ భాషల్లో హెచ్చరికలను పంపడానికి ఉపయోగిస్తారు. తద్వారా అత్యవసర పరిస్థితుల్లో విస్తృతంగా, సమగ్రంగా ప్రజలకు సమాచారం చేరుస్తారు.

ముఖ్యమైన ఈ పరీక్షా దశలో ప్రజల సహకారాన్ని డాట్ కోరుతోంది. ఈ కాలంలో అందే పరీక్షా సందేశాలు కేవలం వ్యవస్థ పనితీరు ధ్రువీకరణ కోసం మాత్రమేనని, స్వీకర్తలు ఎటువంటి చర్యలు తీసుకోనవసరం లేదని మరోసారి స్పష్టం చేస్తోంది.

# ఉత్తరప్రదేశ్ రెండు చివరలను అనుసంధానించడమే కాదు.. దేశ రాజధానిలోని అపరిమిత అవకాశాలనూ గంగా ఎక్స్‌ప్రెస్ రహదారి చేరువ చేస్తుంది: ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 30:ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయిలో కొత్తగా నిర్మిస్తున్న 594 కిలోమీటర్ల పొడవైన ప్రవేశ నియంత్రిత గంగా ఎక్స్‌ప్రెస్ రహదారిని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభించారు. నరసింహ పుణ్యక్షేత్రానికి, కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ప్రవహిస్తున్న గంగామాత దివ్య సన్నిధికి నమస్కరిస్తూ ప్రధానమంత్రి ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ ప్రాంతమంతా గంగామాత ఆధ్యాత్మిక శోభతో, మాతృత్వాన్ని పంచే జీవధారతో పునీతమైన పుణ్యక్షేత్రమని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ ఎక్స్‌ప్రెస్ రహదారి ఉత్తరప్రదేశ్‌కు లభించిన వరం. సాక్షాత్తు గంగామాత ఆశీర్వాదమే ఇది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ఈ ఎక్స్‌ప్రెస్ రహదారి ద్వారా పవిత్ర పుణ్యక్షేత్రాలకు చేరుకునే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గి, కొన్ని గంటల్లోనే అక్కడికి చేరుకోవచ్చని వివరించారు.

గంగామాత శాశ్వత వైశిష్ట్యాన్ని, ఆధునిక మౌలిక సదుపాయాలను పోలుస్తూ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో ఈ ఎక్స్‌ప్రెస్ రహదారి విప్లవాత్మకమైన మార్పును తెస్తుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. కొత్తగా నిర్మిస్తున్న ఈ రహదారులు అభివృద్ధి చెందుతున్న భారతదేశానికి జీవనాడులని శ్రీ మోదీ పేర్కొన్నారు. "ఈ ఆధునిక జీవనాడులు దేశ ఉజ్వల భవితను చాటుతున్నాయి" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఇటీవలి తన ఆధ్యాత్మిక పర్యటనలను గుర్తుచేసుకుంటూ, కొన్ని రోజులుగా తాను గంగామాత సాన్నిధ్యంలోనే ఉన్నానని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఏప్రిల్ 24న బెంగాల్ నుంచి మొదలుకొని- నిన్న కాశీలో, మళ్ళీ ఈ ఉదయం ఇక్కడ వరకు... భక్తి, మౌలిక సదుపాయాల అభివృద్ధి అద్భుత సమ్మేళనంగా తన పర్యటనలు నిలిచాయన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్ రహదారికి గంగామాత పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. "ఇది మా అభివృద్ధి దార్శనికతకు ఇది నిదర్శనం. మన వారసత్వ వైభవాన్ని కూడా ప్రపంచానికి చాటుతోంది'' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. మౌలిక సదుపాయాల నిర్మాణంలో ప్రభుత్వం వేగం పెంచడాన్ని ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ గంగా ఎక్స్‌ప్రెస్ రహదారి దేశంలో కొత్తగా నిర్మించిన వాటిలో అత్యంత పొడవైనదని, అయిదేళ్లలోపే నిర్మాణాన్ని పూర్తి చేశామని ఆయన తెలిపారు. వేగవంతమైన ఆధునికీకరణ దిశగా తమ నిబద్ధతను చాటుతూ.. "ప్రస్తుత ప్రభుత్వ పనితీరులో ఉత్తేజమిది! నేటి ప్రభుత్వం పనిచేసే విధానమిది" అని శ్రీ మోదీ ప్రకటించారు.

పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని వాణిజ్య కేంద్రాలను, మధ్య ఉత్తరప్రదేశ్‌లోని వ్యవసాయ క్షేత్రాలను, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని సాంస్కృతిక కేంద్రాలను అనుసంధానించే ఈ 600 కిలోమీటర్ల సుదీర్ఘమైన గంగా ఎక్స్‌ప్రెస్ రహదారి వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని ప్రధానమంత్రి వివరించారు. పన్నెండు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల జీవితాలపై ఇది నేరుగా సానుకూల ప్రభావాన్ని చూపుతుందని ఆయన చెప్పారు. "గంగా ఎక్స్‌ప్రెస్ రహదారి వేగవంతమైన రహదారి మాత్రమే కాదు. ఇది సరికొత్త అవకాశాలకు, సరికొత్త కలలకు, నూతన ఆశయాలకు స్వాగత ద్వారం" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

రైతులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సవాళ్లను ప్రస్తావించారు. సరైన రవాణా సౌకర్యాలు, శీతల గిడ్డంగుల సదుపాయాలు లేక ప్రధాన మార్కెట్లను చేరుకోవడానికి ఈ సారవంతమైన ప్రాంతాల్లోని రైతులు ఎన్నో ఏళ్లుగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ప్రధానమంత్రి అన్నారు. మెరుగైన అనుసంధానం వల్ల కచ్చితమైన మార్పులు వస్తాయని శ్రీ మోదీ స్పష్టం చేశారు. "ఇది మన రైతుల ఆదాయాన్ని పెంచుతుంది" అన్నారు.

ఈ ఎక్స్‌ప్రెస్ రహదారి వల్ల అనుసంధాన ప్రయోజనాలను వివరిస్తూ... "ఇది ఉత్తరప్రదేశ్‌లోని రెండు చివరలనూ కలపడమే కాకుండా... జాతీయ రాజధాని ప్రాంతంలోని అపారమైన అవకాశాలను మరింత చేరువ చేస్తుంది. ఈ రహదారిపై వాహనాలు పరుగులు తీస్తున్న కొద్దీ, రోడ్డుకు ఇరువైపులా కొత్త పారిశ్రామిక అవకాశాలు పెరుగుతాయి" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

ఈ ఎక్స్‌ప్రెస్ రహదారి వెంబడి ఉద్భవిస్తున్న పారిశ్రామిక అవకాశాలను ప్రస్తావిస్తూ... ఔషధ రంగం, జౌళి, చేనేత, తోలు వస్తువులు, హస్తకళల తయారీ కేంద్రాలను ఆకర్షించేలా హర్దోయి వంటి జిల్లాల్లో పారిశ్రామిక కారిడార్లను వ్యూహాత్మకంగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రధానమంత్రి పేర్కొన్నారు. దీనివల్ల యువతకు సరికొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ముద్ర యోజన, ఓడీఓపీ (ఒక జిల్లా - ఒక ఉత్పత్తి) వంటి పథకాల ద్వారా సశక్తులైన రాష్ట్ర యువతలోని పారిశ్రామిక స్ఫూర్తిని ఆయన అభినందించారు. చిన్న పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలకు ఊతం లభిస్తుందని, అనుసంధాన మార్గాలు మెరుగుపడితే వాటికి సరికొత్త మార్గాలు తెరుచుకుంటాయని ప్రధానమంత్రి వివరించారు. "వీటన్నింటికీ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో భారీ స్థాయిలో చోటు లభిస్తుంది. ఇది లక్షలాది కుటుంబాల ఆదాయాన్ని పెంచుతుంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో అనూహ్య మార్పులను ప్రధానమంత్రి వివరించారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా, బిమారు రాష్ట్రంగా ముద్రపడిన ఆ రాష్ట్రం... నేడు ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోందని గుర్తుచేశారు. రాష్ట్రానికున్న అపారమైన సామర్థ్యం, దేశ యువశక్తి మద్దతుతో... ఈ భారీ లక్ష్యం కోసం అదే స్థాయిలో సన్నాహాలు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ జనాభా సానుకూలతను సద్వినియోగం చేసుకునే వ్యూహాన్ని వివరిస్తూ... యూపీని తయారీ కేంద్రంగా నిలపడం కోసం ఈ శక్తిని ఉపయోగిస్తున్నామని శ్రీ మోదీ తెలిపారు. ఇక్కడ కొత్త పరిశ్రమలు, కర్మాగారాలను నెలకొల్పడమే కాకుండా... భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తాయని, ఆర్థిక పురోగతి వేగవంతమై యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి వివరించారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్ నిలవడంలో ఉత్తరప్రదేశ్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. అందులో సగం ఉత్పత్తి యూపీలోనే జరుగుతోందని గుర్తు చేశారు. "ఈ విజయాన్ని సాధించడంలో ఉత్తరప్రదేశ్ గణనీయమైన సహకారాన్ని అందించింది" అని ఆయన వివరించారు.

అత్యాధునిక సాంకేతికత రంగాల్లో రాష్ట్రం కీలకపాత్ర పోషిస్తోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. నోయిడాలో ఇటీవల జరిగిన భూమి పూజ అనంతరం, సెమీకండక్టర్ తయారీలో ఉత్తరప్రదేశ్ గణనీయమైన పురోగతిని సాధిస్తోందని వివరించారు. "భవిష్యత్తులో అపారమైన అవకాశాలున్న విస్తృతమైన రంగాలు ఉత్తరప్రదేశ్ ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి" అని ప్రధానమంత్రి అన్నారు. కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక వ్యవస్థలో ఇది రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతోందన్నారు. ఉత్తరప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధిని దేశ భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక ఆస్తిగా ప్రధానమంత్రి అభివర్ణించారు. భారత్‌లోని రెండు రక్షణ కారిడార్లలో ఒకటి ఈ రాష్ట్రంలోనే ఉందని, ప్రముఖ రక్షణ రంగ తయారీ సంస్థలు ఇక్కడ తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన బ్రహ్మోస్ క్షిపణుల వంటి వ్యవస్థలు నేడు యూపీలోనే తయారవుతున్నాయని గుర్తుచేస్తూ... "ఉత్తరప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి భారత వ్యూహాత్మక బలంగా మారుతోంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

# ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయిలో గంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభోత్సవ వేళ తన ప్రసంగం ముఖ్యాంశాల్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయిలో గంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభోత్సవం సందర్భంగా తాను ఇచ్చిన ప్రసంగంలోని ముఖ్యాంశాల్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో ఈ రోజు పంచుకున్నారు.

రాష్ట్రం మార్పు దిశగా దూసుకుపోతోందని ఆయన చెబుతూ, మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు పారిశ్రామిక వృద్ధిలో కూడా ఇంతకు ముందు ఎన్నడూ లేనంత జోరు ప్రస్తుతం ఒక కొత్త ఉత్తరప్రదేశ్‌కు గుర్తింపుగా మారుతోందన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి శ్రీ మోదీ అనేక సందేశాలను పొందుపరుస్తూ, ఇలా పేర్కొన్నారు...:

"రెండు ఇంజన్ల ప్రభుత్వంలో శంకుస్థాపనతో పాటు, అనుకున్న కాలం లోపలే ఆ యా ప్రాజెక్టులను దేశ ప్రజలకు అంకితమివ్వాలన్న సంకల్పం కూడా పూర్తవుతోంది. ఇందువల్ల ప్రస్తుత యూపీలోని ఎక్స్‌ప్రెస్‌వే కన్నా వేగంగా ఇక్కడి అభివృద్ధి దూసుకుపోతోంది."

"గంగా ఎక్స్‌ప్రెస్‌వే కేవలం ఒక హైస్పీడ్ రహదారి కాదు, అది కొత్త అవకాశాలకో గేట్‌వే కూడా.

దీంతో రాష్ట్రంలో రైతు సోదరీ, సోదరులకు ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయి."

"గత కొన్ని సంవత్సరాల్లో ఉత్తరప్రదేశ్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంతో పాటు ఈ రాష్ట్రాన్ని తయారీ కూడలిగా తీర్చిదిద్దడానికి నిరంతర ప్రయత్నాలు జరిగాయి. దీనికి ఒకటి కాదు, అనేక ఉదాహరణలు ఉన్నాయి..."

# పదవ తరగతి ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానం

## - ఫలితాలపై కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ ప్రతాప రామకృష్ణ




రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 30:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు 10 తరగతి పరీక్షల్లో అద్భుత ఫలితాలతో తన ప్రతిభను చాటుకుంది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన . గజ్జెల మృదుల 586/600 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, కొక్కుల అక్షయ, మంత్రి నిఖిత, ఎలుముల రాంచరణ్ తలా 569 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. శ్రీ సన్నిధి హరికృష్ణ 565, బోనాల మనస్విని, వేల్పుల రేష్మ తలా 563 మార్కులు సాధించారు. పొన్నం శివాని 561, చిట్ల వైష్ణవి 560 మార్కులు సాధించారు. వీరికి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్, బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప రామకృష్ణ, కరెస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ శాలువాతో పాటు పూల బోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు . డైరెక్టర్ ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత, తల్లిదండ్రుల సహకారం తో ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. పాఠశాల సిబ్బందిని విద్యార్థులను తల్లిదండ్రులను శుభాకాంక్షలు తెలుపుతూ ఇదే స్ఫూర్తిని మునుముందు కొనసాగించాలని ఆకాంక్షించారు. కరెస్పాండెంట్ సన్నిధి వెంకట కృష్ణ మాట్లాడుతూ మొత్తం67 మంది విద్యార్థులు పరీక్ష హాజరై 100% ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు, వీరిలో 36 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా మెరుగైన ఫలితాలు సాధించడం తమ విద్య విధానానికి నిదర్శనం పేర్కొన్నారు.

# యూరియా వాడకాన్ని వ్యవసాయ అధికారుల సిఫారసు మేరకే వాడాలి



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 30:వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సిఫారసు మేరకే యూరియా ను వాడాలని వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ అన్నారు. గురువారం మాగనూర్ మండలం మంజపల్లి గ్రామంలో రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా వాడకాన్ని సిఫారసు మేరకు వాడాలని, ప్రతి పంటలో ఎరువుల యాజమాన్యాన్ని పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. పచ్చి రొట్ట ఎరువులు, వేపపిండి ఎరువు, కోళ్ల ఎరువు, వావిసాకుల ఎరువు , జీవ శిలీంధ్రాలు, అంతర పంటలు, నేల శుద్ధిని పాటించాలని కోరారు.

వచ్చే వానాకాలం సాగుకు రైతులు తీసుకోవలసిన సలహాలు ,సూచనలను వివరించారు. డాక్టర్ బి. శైల, సస్యరక్షణ శాస్త్రవేత్త నీటి యాజమాన్యం, పురుగుల మందులు వాడేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోరాధిక , గ్రామ సర్పంచ్ రఘువీర్ రెడ్డి, శ్రీనివాస్, ఉప సర్పంచ్ , రైతులు పాల్గొన్నారు.

# 10వ తరగతి ఫలితాల్లో కేరళ మోడల్ స్కూల్ విద్యార్థుల ఘనవిజయం




రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 30:(నేటినిజం ప్రతినిధి): పదో తరగతి బోర్డు పరీక్ష ఫలితాల్లో వేములవాడ పట్టణానికి చెందిన కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాల పేరును చాటిచెప్పారు.

ఈ ఏడాది ఫలితాల్లో పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు ఉండగా 25 మందికికు పైగా మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. ప్రతిభావంతుల వివరాలు:పాఠశాల విద్యార్థిని గూడెల్లి ధరణి 578 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, బచ్చు శుక్ల 568 మార్కులతో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరితో పాటు ప్రణవి (550), దీక్షిత (549), అస్మిత (547), మరియు రోషిని (545) మార్కులతో అత్యుత్తమ ఫలితాలను సాధించారు.విద్యార్థుల ఈఘనవిజయం పట్ల పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల బోధనా పటిమకు ఈ ఫలితాలే నిదర్శనమని పేర్కొంటూ, విజేతలను మరియు వారి తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

# 10వ తరగతి ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 30:(నేటినిజం ప్రతినిధి): పదో తరగతి బోర్డు పరీక్ష ఫలితాల్లో కేజీబీవీ వేములవాడ అర్బన్ బాలికలు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాల పేరును చాటిచెప్పారు. ఈ ఏడాది ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఐ. వర్షిత( 556) మార్కులతో ప్రథమ స్థానం నిలువగా టి.రవిత్రేయిని (552 )ద్వితీయ స్థానం కైవాసం చేసుకున్నారు. బి. అక్షిత (546), ఎన్.మధుప్రియ(546 ) మార్కులతో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థుల ఈఘనవిజయం పట్ల జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ పద్మజ పాఠశాల ఎస్.ఓ స్వప్న ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల బోధనా పటిమకు ఈ ఫలితాలే నిదర్శనమని పేర్కొంటూ, విజేతలను మరియు వారి తల్లిదండ్రులను పాఠశాల ఎస్ ఓ ప్రత్యేకంగా అభినందించింది.

# ఎస్ ఎస్ సి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిన కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు




రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 30:(నేటినిజం ప్రతినిధి): ఎస్ఎస్సి పరీక్ష ఫలితాలు లో కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు అత్యధిక మార్కులు ఎర్రం వర్షిల్ 600 మార్కులు గాను 558 మార్కులు సాదించాడు పిల్లి సాత్విక 553 మార్కులు సాధించారు బండ లీలా కృష్ణ 544 మార్కులు సాధించారు అలాగే 500 మార్కులు పైగా 19 మంది విద్యార్థులు సాధించారు అని, స్కూల్ లో చదివిన అందరూ విద్యార్థులు పాస్ అవ్వడం జరిగిందని 100 పర్సంటేజ్ రిజల్ట్స్ వచ్చింది అని కిడ్స్ కాన్వెంట్ స్కూల్ యాజమాన్యం తెలియజేసింది పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకుకిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ ధరక్షన్ వసు పియం, స్కూల్ టీచర్స్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్ఎస్సి ఫలితాలు లో మా విద్యార్థులు సత్తా చాటారు అని చదువుతోపాటు అన్ని రంగాలలో మా స్కూల్ విద్యార్థులు రానిస్తున్నారని ఈ సందర్భంగా కిడ్స్ కాన్వెంట్ స్కూల్ యాజమాన్యం తెలియజేసినది

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

**-రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**
**- మార్క్ ఫెడ్ అధికారులకు వినతిపత్రం అందజేత**

ఖమ్మం, ఏప్రిల్ 30: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చింతకాని, బోనకల్, వైరా, ఖమ్మం, రూరల్ మండల లోని రైతులు పెద్ద సంఖ్యలో పెద్దతండా వద్ద గల మార్క్ ఫెడ్ కు చేరుకుని పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మార్క్ ఫెడ్ డీఎం శ్యామ్ కుమార్ కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి బస్తాలు తరలింపు కోసం అవసం ్వైన లారీలు అందుబాటులో ఉంచాలని, కౌలు రైతుల పేర్లు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని, గోదాములు దగ్గర దిగుమతి ఆలస్యం పేరుతో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయ శాఖ మార్కెట్ గోదాములు యార్డులు ఉపయోగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేసి రాష్ట్రంలో ఎక్కువ దిగుబడి సాధించిందన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని,నెల రోజుల నుంచి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారని తెలిపా రు. సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో మంత్రుల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. సానుకూలంగా స్పందించిన మార్క్ ఫెడ్ డీఎం విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కే.మీరా సాహెబ్, దొండపాటి నాగేశ్వరరావు, రావుల రాజాబా బు, ఉరడీ సుదర్శన్ రెడ్డి, నంది గామ కృష్ణ, చంద్ర వెంకట్రావు, వెంపటి వెంకటేశ్వరరావు, వీరయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

# భారత్-కెన్యా ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేయడానికి

## నైరోబీలో రెండు దేశాల సంయుక్త వాణిజ్య సంఘం పదో సమావేశ నిర్వహణ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: భారత్, కెన్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, ఆర్థిక సహకారాన్ని సమీక్షించి బలోపేతం చేయడానికి భారత్-కెన్యా సంయుక్త వాణిజ్య సంఘం (జేటీసీ) పదో సమావేశాన్ని కెన్యా లోని నైరబీలో 2026 ఏప్రిల్ 27, 28 తేదీల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వాణిజ్య విభాగంలో వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేశ్ అగ్రవాల్‌తో పాటు కెన్యా వాణిజ్య విభాగ ప్రిన్సిపల్ సెక్రటరీ రెజినా అకోతా ఓమ్బమ్ సహాధ్యక్షత వహించారు.

ద్వైపాక్షిక వాణిజ్యంలో నిలకడగా వృద్ధి చోటు చేసుకోవడాన్ని ఉభయ పక్షాలూ ప్రస్తావించాయి. కెన్యా ప్రధాన వాణిజ్య భాగస్వాముల్లో ఒక భాగస్వామిగా భారత్ నిలిచింది. భారత్, కెన్యా మధ్య మొత్తం వాణిజ్యం విలువ 2025-26లో 4.31 బిలియన్ అమెరికా డాలర్లుగా ఉంది. ఇది 2024-25లో నమోదైన 3.45 బిలియన్ అమెరికా డాలర్లతో పోలిస్తే 24.91 శాతం ఎక్కువ. వాణిజ్యాన్ని విస్తరించడం, మార్కెట్ల లభ్యతకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించడంతో పాటు ఇంజినీరింగ్ వస్తువులు, ఫార్మస్యూటికల్స్, వ్యవసాయ, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో పరస్పర పూరకత్వానికి ఉన్న అవకాశాల్ని సద్వినియోగపరుచుకోవడంపై చర్చించారు.

ప్రమాణీకరణ, అనుకూలతా సంబంధిత మూల్యాంకనంలో సహకారాన్ని పెంపొందించుకోవడానికి భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్), కెన్యా ప్రమాణాల బ్యూరో (కేఈబీఎస్)కు మధ్య అవగాహన ఒప్పందం (ఎమ్ఓయూ) సహా ప్రస్తుతం అమలు చేస్తున్న వాణిజ్య సౌలభ్య కార్యక్రమాల్లో పురోగతిని సంఘం సమీక్షిం చింది. ప్రవేశాని కన్నా ముందు గానే కస్టమ్స్ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి సంబంధించి పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్ర మండలి (సీబీఐసీ), కెన్యా రెవిన్యూ ప్రాధికార సంస్థ (కేఆర్ఏ) మధ్య ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలు పూర్తి అయ్యాయి. దీనిలో కస్టమ్స్ ప్రక్రియలను సువ్యవస్థీ కరించే ందుకు, వాణిజ్య సౌలభ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రాధాన్య తనిచ్చారు.

వాణిజ్యం, పెట్టుబడి, పరిశ్రమ సహకారం.. వీటిని ప్రోత్సహించేందుకు భారతీయ పరిశ్రమ సమాఖ్య (సీఐఐ), భారత్ కెన్యా వాణిజ్య, పరిశ్రమ మండలి మధ్య మరో అవగాహన ఒప్పందం పైన సంతకాలయ్యాయి.

స్థానిక కరెన్సీలలోనే వాణిజ్య పరిష్కారాన్ని ప్రోత్సహించేందుకు గల అవకాశాలను ఇరు పక్షాలు గుర్తించాయి. భారతీయ బ్యాంకులతో కెన్యా బ్యాంకులు కలసి స్పెషల్ రుపీ వోస్ట్రో ఖాతాలను (ఎస్ఆర్‌వీఏఎ్) తెరిచాయని, ఈ వ్యవస్థను ఎక్కువగా ఉపయోగిం చుకోవడం ద్వైపాక్షిక లావాదేవీల మార్గాన్ని సుగమం చేయగలదని గుర్తించారు. స్థానిక కరెన్సీ పరిష్కార (ఎల్‌సీఎస్) యంత్రాంగాన్ని అనుసరించేందుకు అవకాశాలు ఎంతమేరకు ఉన్నాయో కూడా చర్చించారు.

కొత్తగా ఉనికిలోకి వస్తున్న రంగాల్లో రంగం వారీ సహకారం అంశంపైనా చర్చోపచర్చలు జరిపారు. ఇంజినీరింగ్- తయారీ రంగంలో, ఆటోమొబైల్స్, యంత్రాలు, నిర్మాణ సామగ్రి రంగాల్లో ఎగుమతులను విస్తరించుకొనేందుకు గల అవకాశాలు ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చాయి. దీంతో పాటు ఆటోఎక్స్‌పో కెన్యా, ది బిగ్ 5 కన్‌స్ట్రక్ట్ కెన్యా వంటి ప్రదర్శనల్లో భాగస్వామ్యం పంచుకునే అంశాన్ని కూడా చర్చించారు. రైల్వేలు సహా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సహకారంపై చర్చించారు. దీనిలో భాగంగా కెన్యా స్టాండర్డ్ గేజ్ రైల్వేకు రైలు పెట్టెలు, ఇంజను వగైరా సరఫరా చేయడం, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సాధ్యాసాధ్యాల అధ్యయనాల నిర్వహణ వంటి సేవలను అందిస్తామని భారత్ ప్రతిపాదించింది. భారతీయ షిప్‌యార్డులతో కలసి నౌకాని ర్మాణంలో సహకారానికి గల అవకాశాల్ని కూడా పరిశీలించారు.

ఔషధ నిర్మాణ రంగంలో, తక్కువ ఖర్చులో జెనరిక్ మందులు, వైద్య పరికరాల సరఫరాదారుగా తాను పోషిస్తున్న పాత్రను భారత్ వివరించింది. బిజినెస్-టు-బిజినెస్ అనుబంధాన్ని పెంచుకొందామని ప్రతిపాదించింది. ఉభయ పక్షాలూ ఆరోగ్య రక్షణ, ఓషధి మొక్కల సంబంధిత సమస్యలను పరిష్కరించుకుంటూ వ్యవసాయ ఉత్పాదనల వాణిజ్యాన్ని పెంచుకోవడంపై కూడా చర్చించాయి.

పునరుత్పాదక ఇంధన రంగంలో, సౌర విద్యుత్తు ప్రాజెక్టులు పవన విద్యుత్తు ప్రాజెక్టులు సహా కెన్యాలో స్వచ్ఛ ఇంధన కార్యక్రమాలకు మద్దతివ్వడానికి సిద్ధమని భారత్ తెలిపింది. అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ)లో చేరాలని నిర్ణయించుకున్నట్లు కెన్యా వెల్లడించింది. ఈ ఒప్పందంపై వీలయినంత త్వరగా సంతకాలు చేయాలని వేచి ఉన్నామంది. ప్రజలకు డిజిటల్ మాధ్యమం ద్వారా ఆర్థిక తదితర సేవలను అందించడానికి అనువైన మౌలిక సదుపాయాల కల్పన కూడా చర్చల్లో చోటు చేసుకుంది. యూపీఐ వంటి చెల్లింపు వ్యవస్థలు, భారత్ కనెక్ట్, ఆర్థిక సేవల్ని మరింత మందికి చేరువ చేసే సాధనాల విషయంలో సహకరించుకోవడం కూడా ప్రస్తావనకు వచ్చింది.

సామర్థ్యాలను పెంచే ప్రక్రియను పరస్పర సహకారానికి ఒక ముఖ్య రంగంగా గుర్తించారు. గనుల తవ్వకం, భూవిజ్ఞానశాస్త్రాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి అనేక రంగాల్లో ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఐటీఈసీ) కార్యక్రమం వంటి వాటిలో శిక్షణను ఇవ్వగలమని భారత్ ముందుకు వచ్చింది. ఉన్నత విద్య, డిజిటల్ మాధ్యమ శిక్షణ వేదికలు, నైపుణ్యాభివృద్ధిలో సహకారాన్ని గురించి చర్చించారు. "స్టడీ ఇన్ ఇండియా" కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల రాక పోకలను పెంపొందించుకొనే అంశంపైనా మాట్లాడుకున్నారు. వైవిధ్యభరిత, సమతౌల్యత సహిత, భావికాల అవసరాలు ప్రధానంగా ఉండే ఆర్థిక భాగస్వామ్యానికి కట్టుబడి ఉంటామని ఇరు పక్షాలూ పునరుద్ఘాటించాయి. వాణిజ్యాన్ని సులభతరంగా తీర్చిదిద్దడానికి, పరిష్కారం కాకుండా మిగిలిపోయిన అంశాలను ఓ కొలిక్కి తీసుకురావడానికి, బిజినెస్-టు-బిజినెస్ అనుబంధాన్ని పెంపొందింపచేసుకోవడానికి సంస్థాగత వ్యవస్థల్ని పటిష్టపరచాలని అంగీకరించాయి.

సంయుక్త వాణిజ్య సంఘం (జేటీసీ) నేపథ్యంలో, భారత్-కెన్యా సంయుక్త వాణిజ్య వేదికను కూడా నిర్వహించారు. దీనిలో సీఐఐ, కెన్యా జాతీయ వాణిజ్య పరిశ్రమ జాతీయ మండలి (కేఎన్‌సీసీఐ)ల ప్రతినిధులు సహా భారత్, కెన్యా వాణిజ్య రంగ ప్రముఖులు పాలు పంచుకున్నారు. భారత ప్రభుత్వ వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేశ్ అగ్రవాల్, కెన్యా రిపబ్లిక్ వాణిజ్య ప్రిన్సిపల్ సెక్రటరీ రెజినా అకోతా ఓమ్బమ్ కీలకోపన్యాసాలిచ్చారు. వారితో పాటు కేఎన్‌సీసీఐ చైర్మన్, ఇన్వెస్ట్‌కెన్యా ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వేదిక తయారీ, వ్యవసాయం, ఫార్మాస్యూటికల్స్, మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ సాంకేతికతలు, సేవల వంటి రంగాల్లో వాణిజ్యాన్ని, పెట్టుబడి సంబంధాల్ని విస్తరించుకొనేందుకు ఒక అవకాశాన్ని పారిశ్రామిక జగతికి చెందిన ప్రముఖులకు అందించింది.

దీనికి అదనంగా, భారత ప్రభుత్వ వాణిజ్య విభాగ కార్యదర్శి శ్రీ రాజేశ్ అగ్రవాల్ అధ్యక్షతన స్థానిక భారతీయ వాణిజ్య సమాజంతో కలసి ఒక ముఖాముఖిని భారత్-కెన్యా వాణిజ్య మండలి నిర్వహించింది. ఈ కార్యక్రమంలో స్థానిక భారతీయ వాణిజ్య సమాజం, వారి వెంట వచ్చిన సీఐఐ వాణిజ్య ప్రతినిధివర్గం పాలుపంచుకున్నాయి. కెన్యాతో వాణిజ్యాన్ని నిర్వహించడానికి సంబంధించిన అవకాశాలు, అనుభవాలపై ఈ సందర్భంగా దృష్టిని కేంద్రీకరించారు.

# ఓబీసీ.. ఈబీసీ.. డీఎన్‌టీ విద్యార్థుల స్కాలర్‌షిప్ సహా "ఉన్నత స్థాయి విద్య" పథకాల అమలులో గణనీయ పురోగమనం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 30: దేశంలో విద్యా సాధికారత దిశగా ప్రభుత్వం కొనసాగిస్తున్న కృషిలో భాగంగా ఇతర వెనుకబడిన, ఆర్థికంగా వెనుకబడిన (ఓబీసీ, ఈబీసీ) తరగతులు సహా డీ-నోటిఫైడ్, సంచార, పాక్షిక సంచార తెగల (డీఎన్‌టీ) విద్యార్థుల కోసం సామాజిక న్యాయం-సాధికారత మంత్రిత్వ శాఖ అనేక పథకాలను అమలు చేస్తోంది.

ఈ వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యా సౌలభ్యం సహా విద్యా ప్రగతికి చేయూతనివ్వడం ఈ కార్యక్రమాల లక్ష్యమని కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ తెలిపారు. ఈ మేరకు 2025-2026 ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యక్రమాల కింద వ్యయాన్ని రూ.2042.08 కోట్లకు పెంచినట్లు ఆయన తెలిపారు.

మునుపటి (2024-25) ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2025-26లో ఓబీసీ సంక్షేమ పథకాల వ్యయం గణనీయంగా పెరిగి 36.96 శాతానికి చేరింది. అర్హులైన లబ్ధిదారులకు విద్యా సహాయం, లక్షిత సంక్షేమ ప్రదానంపై ప్రభుత్వం సదా దృష్టి సారిస్తుండటాన్ని ఇది ప్రతిబిం బిస్తుంది. అలాగే, 2024-25తో పోలిస్తే, మొత్తం నిధుల్లో పథకాల వారీగా పెరిగిన వ్యయాన్ని పరిశీలిస్తే- ఓబీసీ, ఈబీసీ, డీఎన్‌టీల కోసం ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 59.13 శాతం, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 27.18 శాతం, పాఠశాలల్లో ఉన్నత స్థాయి విద్య కింద 154 శాతం, ఇదే వర్గాలకు కళాశాలల్లో ఉన్నత స్థాయి విద్య కింద 105.80 శాతం మేర పెరిగింది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల విద్యా ర్థులకు విద్యావకాశాల విస్తరణ లో ప్రభుత్వ నిరంతర నిబద్ధతను ఈ పథకాల వ్యయంలో పెరు గుదల ప్రతిబింబిస్తోంది. పథకా లను మరింత చురుగ్గా అమలు చేయ డం, ప్రజలకు మరింత చేరువ చేయ డం, అర్హులైన విద్యా ర్థులకు లక్షిత ప్రయోజనాలు సకాలంలో, సమర్థంగా అందేవి ధంగా చూడటంపై మంత్రిత్వ శాఖ దృష్టి సారించింది.

# కారు ఢీకొని సింగరేణి ఉద్యోగి మృతి

ఖమ్మం, ఏప్రిల్ 30: కారు ఢీకొనడంతో సింగరేణి ఉద్యోగి మృతి చెందిన దుర్ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కొత్తగూడెం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ డి. ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ పంచాయతీ పరిధిలో నివసించే రూపేష్ పాసి (36) సత్తుపల్లి కిష్టారం ఓపెన్ కాస్ట్‌లో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి సుమారు 11:15 గంటల సమయంలో రుద్రంపూర్ నుండి కొత్తగూడెంకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీ పంలోని జాతీయ రహదారిపై చంద్రుగొండ నుండి కొత్తగూడెం వైపు వెళ్తున్న టిజి 28 9512 నంబర్ గల కారు అతడిని ఢీకొట్టింది.

# "విమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా-2025: సెలెక్టడ్ ఇండికేటర్స్ అండ్ డేటా" పుస్తకావిష్కరణ




న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 30:కేంద్ర గణాంక-కార్యక్రమాల అమలు శాఖ ఇవాళ ఒడిషాలోని భువనేశ్వర్‌లో నిర్వహించిన "అభివృద్ధి కోసం డేటా"పై జాతీయ స్థాయి చర్చాగోష్ఠి సందర్భంగా "భారత్‌లో మహిళలు.. పురుషులు-2025: నిర్దిష్ట సూచీలు.. సమాచారం' శీర్షికన తన 27వ ప్రచురణను ఆవిష్కరించింది.

వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల నుంచి అందిన సమాచారం ఆధారంగా మంత్రిత్వ శాఖ ఈ పుస్తకాన్ని ప్రచురించింది.

ఇందులో జనా భా, విద్య, ఆరోగ్యం, ఆర్థిక భాగ స్వామ్యం, నిర్ణయాత్మకత, మహి ళలపై హింస, ఇతర లింగ సంబ ంధిత సమస్యలు సహా కీలక రంగాల్లో నిర్దిష్ట సూచీల సంకల నంతో దేశంలోని మహి ళలు-పురుషుల స్థితిగతులపై సమగ్ర అవలోకనాన్ని అందిం చింది. ఈ పుస్తకంలోని గణాంకా లకు ప్రాతిపదికలైన భావనలు, నిర్వచనాలు, మూలాలు, విధాన పరమైన అంశాలపై స్పష్టత దిశగా, వాటిని మరింత సులవుగా అర్థం చేసుకోవడం కోసం 50 కీలక సూచీల సమస్త సమాచారాన్నీ జోడించింది.

అధికారిక గణాంకాల ఆధారంగా విస్తృత శ్రేణి అంశాలలో లింగపరంగా విభజించిన సమాచారం ఇవ్వడం లక్ష్యంగా ఈ ప్రచురణను తీసుకొచ్చింది. ఇందులో గ్రామీణ-పట్టణ వర్గీకరణ, రాష్ట్రం-కేంద్రపాలిత ప్రాంతాలవారీగా, సౌలభ్యానుసారం కాలక్రమంపరంగా అనేక సూచీల ద్వారా వివరాలు పొందుపరచింది. తద్వారా దేశవ్యాప్తంగా లింగ అసమానతలు-అభివృద్ధి ధోరణులపై ఈ పుస్తకం పూర్తి అవగాహన కల్పిస్తుంది.

కీలక సామాజిక-ఆర్థిక సూచీల విశ్లేషణతోపాటు కొత్త ధోరణులను ప్రముఖంగా ప్రస్తావించడం ద్వారా విధాన రూపకర్తలు, పరిశోధకులు, ఇతర భాగస్వాములకు ఈ పుస్తకం విలువైన నిదర్శనాధారిత గణాంకాలను అందించింది.

సమ్మిళిత, సుస్థిర ప్రగతిని ప్రోత్సహించే లక్ష్యంతో లింగ-ప్రతిస్పంద నాత్మక విధానాలు, కార్యక్రమాల రూపకల్పనకు ఇది తోడ్పడుతుంది.

